# ల్యాండ్ మాఫియా



**"నన్నెవరో చంపాలని ప్రయత్నిస్తున్నారని నా అనుమానం సార్."**

**డిటెక్టివ్ నందన్ ముప్పయ్ ఆరేళ్ళ ఆ వ్యక్తి కేసి పరిశీలనగా చూసాడు. మధ్యతరగతికి చెందినవాడిలా కనిపించే అతడు, ఎందుకో బాగా భయపడిపోతున్నాడు.**

"మిమ్మల్ని ఎవరు చంపాలనుకుంటున్నారని మీ అనుమానం? ఐ మీన్ ఎవరి మీదైనా అనుమానం వుందా?"

"గవర్నమెంట్ ఆఫీస్‌లో గుమస్తా ఉద్యోగం చేసుకు పోతున్న నాకంటూ శత్రువులెవరుంటారు సార్?!... ఎవరివల్లనైనా నాకు కీడు జరుగుతుందనుకుంటే, వారిని అనుమానించొచ్చు..." అతడు తల అడ్డంగా ఆడించాడు.

"మరి అనుమానితులు లేకుండానే హత్యాప్రయత్నం జరిగిందని మీరెందుకనుకుంటున్నారు?!"

జరిగిన సంఘటనలు గుర్తొచ్చాయి కాబోలు అతడి తనువు వణికింది. గాఢంగా ఊపిరి పీల్చి వదిలాక చెప్పాడు. "సార్! మొన్న ఆఫీసు వదిలాక మెట్లు దిగుతుంటే, ఎవరో వెనుక నెట్టినట్టు ముందుకు తూలాను. అదృష్టవశాత్తు రెండు మెట్లు తూలాక పట్టుదొరికి కిందికి దొర్లలేదు. ఒకవేళ అలా దొర్లి వుంటే, మూడు ఫోర్లు దొర్లి ప్రాణాలు పోగొట్టుకుని వుండేవాడ్ని. మొదటిసారి అలా జరగడంతో నేను ఎవరో నెట్టారని భ్రమపడ్డాననుకున్నాను. కాని నిన్న స్కూటర్ మీద వెళ్తున్నప్పుడు హఠాత్తుగా నేను సైడ్ వెళ్ళకుంటే, హారన్ కొట్టకుండా వేగంగా వచ్చిన ఆ కారు నా స్కూటర్‌ని తుక్కు తుక్కు చేసి వుండేది. అప్పుడే కన్‌ఫర్మ్ అయ్యింది- ఎవరో నన్ను చంపాలని ప్రయత్నిస్తున్నారని... అది కూడా 'హత్య' చేసినట్టుకాకుండా, యాక్సిడెంటల్ డెత్‌లా క్రియేట్ చేయాలని అనుకుంటున్నారు..."

'అతడి మానసిక స్థితి సరిగానే వుంది కాబట్టి, తను భ్రమల్లో లేడన్నది నిజం. కాకపోతే అనవసరం అనుమానాలు పెంచుకుంటున్నాడా?' నందన్ నిలువుగా తలాడించాడు. "పోలీసులకు ఇన్‌ఫార్మ్ చేయలేదా?"

"హత్య జరిగాక గానీ రాని పోలీసులు, కేవలం అనుమానం వుందంటే రియాక్ట్ అవుతారని అనుకోను." అతడు నవ్వాడు.

అతడున్నది నిజమే! అందుకే కాసేపు ఆలోచించాక పలికాడు. "సరే! ఈ కేస్ నేను టేకప్ చేస్తాను. ఐతే నువ్వు నేను చెప్పినట్టు వినాలి."

"అలాగే సార్."

మరి కాసేపు మాట్లాడాక ఆ వ్యక్తి వెనుతిరిగాడు.

'అతడు వెళ్ళిన అర నిముషం తర్వాత నందన్ మొబైల్ తీసుకుని నంబర్ ప్రెస్ చేసాడు. "ఈశ్వర్! ఈ క్షణం నుండి నువ్వు పరశురామ్ అనే వ్యక్తిని ఫాలో కావాలి. అతడి డీటైల్స్ ఇస్తాను నోట్ చేసుకో..." తన అసిస్టెంట్‌కి డీటైల్స్ అందించాక కాల్ కట్ చేసి, మొబైల్ పక్కన పెట్టాడు.

⁂

నందన్ అసిస్టెంట్ ఈశ్వర్ ఓ రోజంతా పరశురామ్‌ని ఫాలో అయ్యాక తన బాస్‌కి రిపోర్ట్ చేసాడు. "అతడి అనుమానం నిజమే సార్... ఓ వ్యక్తి తనను ఫాలో అవుతున్నాడు".

"ఆ వ్యక్తి ఎలా వున్నాడు?"

మొబైల్ ఫోన్‌లో వీడియో ఆన్‌చేసి చూపిస్తూ "ఆ వ్యక్తికి తెలియకుండా రికార్డ్ చేసాను సార్."

నందన్ రికార్డెడ్ అవుట్‌పుట్ పరిశీలించాక "పరశురామ్ ప్రమాదం అంచున వున్నాడు. ఎలాగైనా మనం అతడిని కాపాడాలి" అంటూ ఛెయిర్‌లోనుండి లేచాడు.

'ఎక్కడికి సార్?' అని ప్రశ్నించలేదు ఈశ్వర్. మౌనంగా అనుసరించాడు.

కారు ఓ అపార్ట్‌మెంట్ ముందు ఆగింది.

నందన్ డ్రైవింగ్ సీట్లో నుండి దిగకుండానే చుట్టూ పరిశీలించాడు. వీడియోలో కనిపించిన వ్యక్తి పరిసరాల్లో లేడని నిర్ధారించుకున్నాకే మొబైల్‌లోనుండి పరశురామ్‌కి కాల్ చేసాడు. "మిస్టర్ పరశురామ్! నేను మీ అపార్ట్‌మెంట్ ముందే వున్నాను. మరోసారి కిందికి వస్తే కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడుకుందాం."

పది నిముషాల తర్వాత పరశురామ్ ఆ కారులోకి ఎక్కాడు.

నందన్, ఈశ్వర్ మొబైల్‌లోని వీడియో చూపిస్తూ "మిమ్మల్ని వెంటాడుతున్న వ్యక్తి ఇతడే!... ఇతడెవరో మీకు తెలుసా?!" ప్రశ్నించాడు.

ఇంతకాలం తనకు కనిపించకుండా ఫాలో అవుతూ, ప్రాణాలు తీయాలనుకున్న ఆ వ్యక్తిని పరిశీలనగా చూసాడు పరశురామ్ ఆ వీడియోలో అతడు తనను ఫాలో కావడం స్పష్టంగా తెలుస్తోంది. కాని అతడెవరు?!

"ఇతడెవరో, నన్నెందుకు ఫాలో అవుతున్నాడో అర్థం కావడంలేదు సార్."

అప్పటివరకూ నందన్‌లో చిన్న ఆశ వుండేది. మొబైల్‌లో ఆ వ్యక్తిని చూడగానే గుర్తించి, హత్యాప్రయత్నానికి కారణమేంటో అతడే బయటపెడుతాడని!... ఆ వ్యక్తినే గుర్తించలేకపోతే, హత్యకు కారణం ఎలా తెలుసుకోవడం?!

నందన్ చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయాడు.

అతడేదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడని అర్థమయ్యాక మిగిలిన ఇద్దరూ తనను పలకరించే ప్రయత్నం చేయలేదు.

డిటెక్టివ్ నందన్ ఓ నిర్ణయానికి వచ్చినట్టు పరశురామ్‌కేసి చూసాడు. "మీ అనుమానానికి ఆధారాలు దొరికాయి. కాని కారణం తెలుసుకోవాలి. అతడిని పట్టుకుంటే... నిజం కక్కించచ్చు. కాని అంతకు ముందే మనం నిర్ధారించుకోవలసిన అంశాలు కొన్ని వున్నాయి... ఎందుకైనా మంచిది. రెండు రోజులు ఆఫీసుకి సెలవు పెట్టి ఇంట్లోనే వుండిపోండి."

"అలాగే సార్" అతడు కారు దిగి వెళ్ళిపోయాడు.

⁂

'ఫాలో అవుతున్న వ్యక్తిని పట్టుకుంటే... హత్యకు కారణాలు తెలుస్తాయా?!... ఒకవేళ అతడే ఈ ప్రయత్నం చేస్తుంటే, నిజం బయటకొస్తుంది. కాని అతడి వాలకం చూస్తుంటే తనెవరో ఉపయోగించుకుంటున్నట్టుంది... మరి ఈ వ్యక్తి వెనుక వున్న ఆ అసలు వ్యక్తి ఎవరు?!... అతడిని బయటకు లాగితేనే... పరశురామ్ పూర్తిగా ప్రమాదంనుండి బయటపడ్డట్టు..'

అతడి ఆలోచనలు కట్ చేస్తూ మొబైల్ రింగయ్యింది. "హలో ఈశ్వర్! చెప్పు"

"సార్! ఆ వ్యక్తి స్వాతి లాడ్జిలో రూమ్ తీసుకుని వుంటున్నాడు. నేనూ ఇక్కడే రూమ్ తీసుకున్నాను. ఇప్పటివరకూ సేకరించిన దాన్నిబట్టి ఆ వ్యక్తి తమిళియన్. వారంరోజుల క్రితమే ఇక్కడికి వచ్చాడు..." ఈశ్వర్ చెపుతుంటే, నందన్ మధ్యలోనే కట్ చేసాడు.

"అతడు ఎవరికి ఫోన్ చేస్తున్నాడో ట్రేస్ చేసే అవకాశముందా?"

"మొబైల్స్ వచ్చాక ట్రాపింగ్‌ని తప్ప, మరోలా ట్రేస్‌చేసే

జె.వి.బాబు

